క్లుప్తంగా

వైఎస్సార్‌టీఎఫ్ డైరీ ఆవిష్కరణ



వైఎస్సార్‌టీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ముద్రించిన 2023వ సంవత్సర డైరీని సోమవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులంతా పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు మద్దెల మునిశారద, నాయకులు పాల్గొన్నారు

రొమ్ము, గర్భకోశ క్యాన్సర్‌పై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చంద్రగిరి : మండలంలోని పిచ్చినాయుడుపల్లెలో ఎస్వీ వైద్యకళాశాల, ప్రసూతి ఆస్పత్రి వారు రొమ్ము, గర్భకోశ ముఖద్వార క్యాన్సర్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ జయరాములు మాట్లాడుతూ 30 ఏళ్ల పైబడిన మహిళలు క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, చికిత్స ప్రసూతి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అనంతరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. 65 మందికి స్క్రీనింగ్, 10 మందికి ప్యాప్ స్మియర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సంధ్య, డాక్టర్ పవన్ కుమారి, డాక్టర్ సౌమ్య ప్రియ పాల్గొన్నారు.

6న కలెక్టరేట్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

తిరుపతి కల్చరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు, సొంత ఇంటి స్థలం లేని పేదలందరూ ఫిబ్రవరి 6న తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు తరలి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో అనేక భూ సమస్యలు ఉన్నాయని .. సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యతగా పోరాట కార్యక్రమాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలయ్య, రుద్రపాక శ్రీనివాసులు, వెంకయ్య, సుబ్బారావు, నాగభూషణం, ఆర్.బలరాం పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని వేకువ జామున మేల్కొలిపి అభిషేకం, అర్చనలు చేపట్టి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు బోణాలు సమర్పించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు అంబలి పంపిణీ చేశారు.

56 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, పబ్లిక్‌స్థలంలో డబ్బుపెట్టి పేకాట ఆడడం, ఇతర నేరాలకు పాల్పడిన 56 మందికి రూ.39,620 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సుబ్బలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్, ఎస్వీయూ, వెస్ట్, ఈస్ట్, అలిపిరి స్టేషన్ల పోలీసులు నేరాలకు పాల్పడిన 56 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

మీ భూమికి మాది హామీ

- మహాయజ్ఞంలా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం
- అవగాహనతో ప్రజలు తమ స్థలాలకు శాశ్వత హక్కును పొందండి
- ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష, అధికారులు

తిరుపతి తుడా: బ్రిటీష్ హయాంలో జరిగిన భూహద్దుల ఆధారంగానే సుమారు వందేళ్లపాటు కొనసాగుతున్నామని, ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శాశ్వత భూహక్కుపై సర్వేని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పోస్టర్‌ను మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ శిరీష, కమిషనర్ హరికృష్ణతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పక్కా భూ సర్వేకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ భూలావాదేవీలను సులభతరం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమగ్ర సర్వేకు పూనుకున్నారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఈ సర్వే కొనసాగుతుందన్నారు. శాశ్వత భూహక్కు పథకంపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మీ భూమి ఇంటి స్థలాలకు శాశ్వత హక్కు పొందడానికి ఈ పథకం ఎంతగానో దోహద పడుతుందన్నారు. స్థిరాస్తులను ఆధునిక పరిజ్ఞానం రోవర్, డ్రోన్ల ద్వారా రీ సర్వే చేయనున్నట్లు చెప్పారు. మీ భూమి మా హామీ అన్న నినాదంతో భూ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వార్డు వలంటీర్లు, ప్లానింగ్ సెక్రటరీలు ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు అందజేయడంతో పాటు పథకంపై పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. భూరక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరికృష్ణ మాట్లాడుతూ సమగ్ర రీసర్వే ద్వారా రెవెన్యూ రికార్డుల వివరాలు డిజిటల్ రూపంలో భూ కమతం, పట్టణ సర్వేపటం, రీసర్వే ల్యాండ్ రిజిస్టర్, పట్టణ సర్వే పటం, 1బి రిజిస్టర్, శాశ్వత భూహక్కు పత్రాలు తయారు చేయబడిన సమగ్ర రీసర్వే చేసే విధానం, ఇందువల్ల కలుగు ప్రయోజనాలను ప్రతి స్థిరాస్తిదారునికి తెలియజేయడానికి వార్డు సభలను ఏర్పాటు చేస్తామని, అలానే సర్వే విధి విధానాలు, సర్వే ప్రయోజనాలను వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్, అదనపు కమిషనర్ సునీత, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి పల్లె ప్రగతిపథం వైపు



పైడిపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

- రూ.3.25 కోట్లతో పైడిపల్లి పంచాయతీ అభివృద్ధి
- ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పల్లె ప్రగతి పథంలో దూసుకుపోతోందని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కొనియాడారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పైడిపల్లి పంచాయతీలో ఆయన నిర్వహించిన గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. పల్లె ప్రజలు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సర్పంచ్ విష్ణు స్పందన, గ్రామస్తులు ఆయన వెంట నడవగా మంగళవారం పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. ముందుగా వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గడప గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు తెలుసుకుని ప్రజలను ఆరా తీస్తూ, వినతులను స్వీకరించారు. పల్లెప్రజల సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

రూ.3.25 కోట్లతో అభివృద్ధి పనులు..

ప్రతి పల్లె ప్రగతి పథంలో పయనిస్తోందని, వైఎస్సార్‌సీపీ హయాంలోనే పల్లె అభ్యున్నతి సాధ్యమైందని ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ పరిధిలో రూ.3.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలకు అతీతంగా అందిస్తున్నట్లు చెప్పారు. సామూహిక మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని దళితవాడ ప్రజలు కోరారు. అలాగే కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విన్నవించారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ నివేదికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: మండలకేంద్రంలోని గాంధీనగర్‌లో వెలసిన శ్రీశ్రీశ్రీ విరూపాక్షమ్మకు మంగళవారం తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి జాతర సందర్భంగా మంగళవారం పాకాలకు చేరుకున్న ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విరూపాక్షమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. దర్శనానంతరం ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు తమపై చూపుతున్న ప్రేమానురాగాలకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. అన్ని సమయాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, నాయకులు నరేష్‌రెడ్డి, మునీర్, కపిలేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ సురేఖ, సురేష్, మధుబాబు, చలపతి, మురళి, చంద్రశేఖర్, వెంకటేష్, ధనంజయ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అరకొర వసతులు

తిరుపతి అర్బన్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరానికి దేశవిదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. అయితే తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆ మేరకు సౌకర్యాలు కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రిజర్వేషన్ కార్యాలయంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సౌకర్యాలు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు రైల్వేస్టేషన్‌లో తాగునీటి కొళాయిలు గంట పనిచేస్తే, ఆ తరువాత పనిచేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా దుకాణదారులు నిత్యావసర వస్తువుల ధరలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారని చెబుతున్నారు. రైల్వే అధికారులు ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ధరలను అదుపులోకి తీసుకురావాల్సి ఉందని డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధిహామీ పనులపై బహిరంగ ప్రజావేదిక

పాకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి సమక్షంలో బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 2020-2021, 2021-2022 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15, 16వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2020-2021 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ, ఫారెస్ట్, ఎస్ఈఆర్పీ శాఖలకు సంబంధించి మొత్తం 1233 పనులు చేసినట్లు, ఈ పనులకు రూ.5,03,13,600 నిధులను వినియోగించారన్నారు. అలాగే ఈ శాఖల్లో 2021-2022 ఆర్థిక సంవత్సరంలో 1241 పనులకు రూ.7,12,91,614 నిధులు కేటాయించారని తెలిపారు. ఆడిట్ సభ్యులు గత నెల రోజులుగా గ్రామాల్లో పర్యటించి రెండేళ్లగా జరిగిన పనులకు సంబంధించి తనిఖీలు నిర్వహించారని చెప్పారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులు, అధికారుల వద్ద ఆమోదం పొందారన్నారు. ఈ పనులకు సంబంధించి మండలస్థాయిలో బహిరంగంగా సమావేశం నిర్వహించి లోటుపాట్లను సరి చూశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, డీవీఓ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసారాయుడు, ఏపీడీ పద్మజ, వెలుగు ఏపీడీ ప్రభావతి, ఎంపీడీఓ రమేష్‌బాబు, ఏపీఓ కల్యాణి, డీఆర్పీలు, సీఆర్పీలు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు జవాబుదారీగా ఉండాలి



చిన్నగొట్టిగల్లులో ఈ పంట నమోదును సూపర్ విజన్ చేస్తున్న జేసీ బాలాజీ

భాకరాపేట : రైతులకు అధికారులు జవాబుదారీగా ఉండాలని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ఏడీ బాలాజీ అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల, చట్టివారిపాళెం, తిప్పిరెడ్డిగారిపల్లె, చిన్నగొట్టిగల్లు రైతు భరోసా కేంద్రం పరిధిలోని ఈ పంట నమోదును ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి రైతు సాగు చేసే పంటల వివరాలను నమోదు చేసి వారికి సహకారం అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఆర్‌బీకే సిబ్బంది నమోదు చేసిన ఈ పంట నమోదును సూపర్‌విజన్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు అన్నివిధాలా సహకారం అందించేందుకు ఆర్‌బీకేలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమాన్‌నాయక్, వ్యవసాయాధికారి ధనలక్ష్మి, ఉద్యాన శాఖాధికారి శివకుమారి, వీఆర్‌ఓలు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





ఆశీర్వాదం

శిల్పకళా వేదికలో శ్రీసిటీ జీఎం రామచంద్రారెడ్డి కుమార్తె వినీష, దీపక్‌రాజ్ వివాహ రిసెప్షన్‌లో వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు

-తిరుచానూరు

నిందితులకు రిమాండ్

తిరుపతి లీగల్ : రెండువేర్వేరు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఒకటి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు రిమాండ్ విధిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గాజులమండ్యం పోలీసు స్టేషన్ పరిధిలో జనవరి 19వ తేదీ గాజులమండ్యం హరిజనవాడ, పంచాయతీ పరిధిలో వ్యవసాయ భూముల వద్ద ఏర్పాటు చేసిన ఏపీఎస్పీడీసీఎల్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి అందులోని రాగి వైర్లను చోరీ చేస్తున్న కేసులో వడమాలపేట మండలం బ్రాహ్మణపట్టు కాయంపేటకు చెందిన పి.మురళికి ఈనెల 14వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పవన్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గాజులమండ్యం పోలీసులు నిందితుడు మురళిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అదేవిధంగా తిరుమల పీఏసీ-2లో కర్ణాటకకు చెందిన ఓ భక్తుడి సెల్‌ఫోన్‌ను అపహరించిన కేసులో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ పొంతమూరు భవానీపురానికి చెందిన ఎం.భారతీకృష్ణ, జి.సతీష్‌కు ఈనెల 14వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్‌సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తిరుమల టూటౌన్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ప్రకృతి సాగు పుడమికి మేలు

- రైతు సాధికార సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్ రెడ్డి



మామిడిపూతను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

నారాయణవనం: ప్రకృతి వ్యవసాయంతో భూమిని కాపాడుతూ, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకునే అవకాశం ఉంటుందని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణవనం, వడమాలపేటలలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. మండలంలోని అరణ్యంకండ్రిగ ఆర్బీకేలో రైతులు, ప్రకృతి వ్యవసాయ రైతులతో మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు సరిపడా ఆహార ఉత్పత్తి కావడం లేదన్నారు. రసాయన ఎరువులను విచక్షణా రహితంగా వినియోగించడంతో భూక్షామం అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. రసాయనరహిత ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని శక్తివంతంగా మార్చి, అత్యధిక పోషకాలతో కూడిన దిగుబడులను పొందవచ్చునని చెప్పారు. సంపూర్ణ సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో గోమూత్రం, గోపేడ నుంచి ఘన, ద్రవ జీవామృతాలతో విత్తనశుద్ధి, నవధాన్యాల పచ్చరొట్ట, వానపాములు, మిత్ర పురుగుల ద్వారా భూసారంతో పాటు కర్బనీకరణ పెరిగి వేపాకులు, స్థానిక వనరులతో ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, పంచగవ్యల సాగుతో నేలలో జీవ పదార్థం, భూసారం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి, మానవాళి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని రక్షిస్తుందన్న నినాదంతో రైతుల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే టీటీడీ కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు.

ప్రకృతి సాగు క్షేత్రాల సందర్శన

అంతకు ముందు మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి ప్రకృతి సాగు క్షేత్రాలను ఆయన సందర్శించారు. దశపర్ణి కషాయ పిచికారితో ఏపుగా పూసిన పూతలతో నిండిన మామిడి తోటను పరిశీలించి, యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి సాగుకు అధికంగా వినియోగించే నల్లబెల్లంపై ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్నామని సుదర్శనరెడ్డి అన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యంతో పాటు, సూక్ష్మ పోషకాలను 50 శాతం సబ్సిడీతో అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభాకర్‌రెడ్డితో పాటు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ మునిరత్నం, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, అరణ్యకండ్రిగ ఉపసర్పంచ్ మురళి, ప్రకృతి వ్యవసాయ ఇన్‌స్ట్రక్టర్లు మోహన్‌రాజు, మల్లికార్జున, నీలమ్మ, యూనిట్ ఇన్‌చార్జి భూపతి, క్షేత్ర స్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొటాలలో 'సివిల్ రైట్స్ డే'



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

చంద్రగిరి : మండలంలోని కొటాల దళితవాడలో సర్పంచ్ గంగులమ్మ అధ్యక్షతన మంగళవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దార్ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హక్కులపై దళితులకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెలాఖరులో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దళితులకు అందాల్సిన పథకాలు పక్కదారి పడితే వెంటనే నిలదీయాలన్నారు. ఎస్ఐ వంశీధర్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. యువత రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలను సూచించారు. అసాంఘిక కార్యక్రమాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ మోహన్‌రెడ్డి, ఆర్ఐ సులోచన, సెక్రటరీ మధు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు ఉత్తమం



ముడియూరులో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీఏ వెంకటేశులు

పిచ్చాటూరు: చిరుధాన్యాలు సాగు చేయడం రైతులకు ఉత్తమమని డీడీఏ వెంకటేశులు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం పురస్కరించుకుని చిరుధాన్యాల సాగుపై మంగళవారం మండలంలోని ముడియూరు రైతుభరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా డీడీఏ మాట్లాడారు. సజ్జ సాగు చేసిన రైతులకు హెక్టార్‌కు విత్తనశుద్ధి మందులతో పాటు ఇతర పురుగు మందులు ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందన్నారు. ఒక ఎకరం వరి పండించే నీటితో నాలుగు ఎకరాలు చిరుధాన్యాలు పండించవచ్చన్నారు. సత్యవేడు ఏడీ రమేష్ రెడ్డి మాట్లాడుతూ మే, జూన్‌లో చిరుధాన్యాలు సాగు చేస్తే ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. చిరుధాన్యాల్లో పీచు పదార్థాలు ఎక్కువ ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం పులింగుంట విద్యార్థులతో కలిసి చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓలు సంజీవ రెడ్డి, శ్రీను, ఎంపీఎస్ వేణుగోపాల్, సుధ, కేవీకే శాస్త్రవేత్త దివ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.